



EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
గురువారం
25-12-2025
పేజీలు: 02



## కేథడ్రల్ చర్చిలో క్రిస్మస్ ప్రార్థనల్లో పాల్గొన్న ప్రధాని మోదీ

దేశవ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. స్థానిక చర్చిల్లో ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సైతం క్రైస్తవ ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఢిల్లీలోని కేథడ్రల్ చర్చ్ ఆఫ్ ది రిడెంప్షన్‌లో ఉదయం ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభు యేసుకి ప్రధాని మోదీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ప్రధాని తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. ఢిల్లీలోని కేథడ్రల్ చర్చలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దేశ ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కూడా దేశ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఆనందం, ఉత్సాహాన్ని పంచే పండుగ క్రిస్మస్ అని పేర్కొన్నారు.

# కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం.. 17 మంది మృతి

కర్ణాటకలో పండగపూట తీవ్ర విషాదం చోటు చేసుకుంది. తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో బెంగుళూరు నుంచి గోకర్ణకు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును లారీ ఢీకొట్టడంతో బస్సులో మంటలు చెలరేగాయి. క్షణాల్లో బస్సు పూర్తిగా కాలిపోవడంతో అందులోని 17 మంది సజీవదహనం అయినట్లు సమాచారం. హిరియూర్ సమీపంలో ఈ ఘటన జరిగింది. ప్రమాద సమయంలో బస్సులో సుమార్ 32 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. వాహనదారులిచ్చిన సమాచారంతో పోలీసులు, రెస్క్యూ టీమ్ ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను దగ్గరలోని ఆస్పత్రికి తరలిస్తున్నారు. క్రిస్మస్ పండగ పూట ఈ విషాదం చోటు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీటి పర్యంతం అవుతున్నారు.
ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది.. ప్రమాద స్థలానికి చేరుకుని.. సహాయక చర్యలు ప్రారంభించారు. ఘటనా స్థలానికి చేరుకున్న వెంటనే అగ్ని మాపక సిబ్బంది రంగంలోకి దిగి మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు శాయశక్తుల ప్రయత్నించారు. అయితే ఈ ప్రమాదంలో బస్సు కూడా పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదం కారణంగా ఆ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. బస్సులో ఉన్న ప్రయాణికులు అందరూ చనిపోయేందుకు అవకాశం ఉంది అంటున్నారు. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు.
ఈ ప్రైవేటు ట్రావెల్ బస్సు ప్రమాదానికి గురైన సమయంలో దీనిలో 42 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది.





## బీఆర్ఎస్‌లోకి మళ్లీ వెళ్లే ప్రసక్తే లేదన్న కవిత

నేను ఎవరో వదిలిన బాణాన్ని కాదు తెలంగాణ గడ్డపై ప్రజల కోసం ఎక్కుపెట్టిన బాణాన్ని అని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. రాజకీయాల్లో తన పంథా ఇకపై ప్రజల పక్షమేనని, పోరాటంలో వెనక్కి తగ్గేది లేదని ఆమె తేల్చి చెప్పారు. బుధవారం భువనగిరిలో 'జనంబాట' కార్యక్రమంలో భాగంగా ఆమె మీడియాతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనపై వస్తున్న విమర్శలపై కవిత స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.గత ప్రభుత్వంలో నేను ఎప్పుడూ కీలక పాత్రలో లేను. కుట్రపూరితంగా నన్ను కేవలం నిజామాబాద్‌కే పరిమితం చేశారు. అయితే, ఆ సమయంలో పార్టీలో ఉన్నాను కాబట్టి, ప్రభుత్వ తప్పులకు నేను కూడా బాధ్యురాలినే. ఆ పాపంలో నాకూ భాగముంది. అందుకే ప్రజలకు బేషరతుగా క్షమాపణలు కోరుతున్నాను అని ఆమె పేర్కొన్నారు.తన భవిష్యత్ రాజకీయ ప్రణాళికను కవిత ఈ సందర్భంగా బయటపెట్టారు. తిరిగి బీఆర్ఎస్‌లో చేరే ప్రసక్తి అస్సలు లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం మధ్యలో జరిగే ఎలాంటి ఉప ఎన్నికల్లోనూ, ఇతర పోటీల్లోనూ తాను పాల్గొనబోనని చెప్పారు. నేరుగా 2029 అసెంబ్లీ ఎన్నికల్లోనే స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతానని ప్రకటించారు. ఎలాంటి కారణం చెప్పకుండానే తనను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయడంపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.కారణం లేకుండా సస్పెండ్ చేయడం బాధ కలిగించింది. కానీ నా ఆత్మగౌరవం ముఖ్యం. దానిపై రాజీపడను. అందుకే ప్రజల కష్టసుఖాలు తెలుసుకోవడానికి 'జనంబాట' పట్టాను. జాగృతి అనేది కేవలం పార్టీ విభేదాల వల్ల పుట్టింది కాదు.. 19 ఏళ్ల కిందటే తెలంగాణ భాష, సంస్కృతి కోసం ఏర్పడిన సంస్థ అని గుర్తుచేశారు.

# శంబాలా సినిమా రివ్యూ




ఆది సాయికుమార్ ప్రధాన పాత్రలో నటించిన మిస్టరీ థ్రిల్లర్ శంబాలా: ఏ మిస్టికల్ వరల్డ్. సైన్స్ దేవుడికి మధ్య జరిగే పోరాటం ఈ సినిమా. ఇది ఎలా ఉందో పూర్తి రివ్యూలో చూద్దాం.. 1980వ దశకంలో శంభాల అనే ఒక ఊరిలో ఆకాశం నుంచి ఒక ఉల్క జారి పడుతుంది. అది పడిన తర్వాత ఆ ఊర్లో వింత అనుభవాలు ఎదురవుతాయి. దాంతో బండ భూతం తమ ఊరిలో పడిందని.. దానివల్ల మనుషులు వరుసగా చనిపోతున్నారు ఊరికి అరిష్టం అని జనాలు భావిస్తుంటారు. అదే ఊరికి సైంటిస్ట్ (ఆది సాయికుమార్) వస్తాడు. అసలేం జరిగింది అని తెలుసుకునే క్రమంలో అతడికి దేవి (అర్చన అయ్యర్) ఎలా సాయం చేసింది..? ఆ ఊరిలో పడిన ఉల్కకు శివుడికి ఏంటి సంబంధం.. అనేది అసలు కథ.. దేవుడు, సైన్స్.. ఈ రెండింటి మధ్య పోరు అంటే ఎప్పుడు ఆసక్తికరమే.. శంబాల సినిమాల కోసం దర్శకుడు యుగంధర్ ముని తీసుకున్నది ఇదే లైన్. సైన్స్ గొప్ప అనే హీరో.. దానికి మించింది ఉంది అని నమ్మే ఊరు జనం.. ఈ రెండు వర్గాల మధ్య జరిగే కథ శంబాల. చాలా ఆసక్తికరంగా సినిమాను మొదలు పెట్టాడు దర్శకుడు యుగంధర్. తొలి పది నిమిషాల్లోనే అసలు కథ చెప్పేసాడు. ఆ తర్వాత వచ్చే సన్నివేశాలు కూడా ఆసక్తికరంగానే ఉన్నాయి.. ఇంటర్వెల్ వరకు ఏం జరుగుతుంది అనే ఆసక్తి అందరిలోనూ ఉంటుంది. సెకండ్ హాఫ్ మెయిన్ కథ ఓపెన్ అయిన తర్వాత.. స్క్రీన్ ప్లే మరింత వేగంగా పరుగులు పెట్టింది. మధ్య మధ్యలో సైన్స్ కంటే మించింది మరొకటి ఉంది అని నిరూపించే సన్నివేశాలు సినిమాపై ఆసక్తి మరింత పెంచేస్తాయి. దుష్టశక్తుల ఆవహించిన శరీరం చేసే వింత చేష్టలు.. దాన్ని అరికట్టలేక పాట్లు పడే ఊరు జనం.. వీళ్ళ మధ్యలో హీరో చేసే పోరాటం.. ఎవరికి తెలియకుండా దేవత అందించే సాయం.. ఇలాంటి కొన్ని సన్నివేశాలు శంభాలను మరింత ప్రత్యేకంగా మార్చాయి.. క్లైమాక్స్ చాలా బాగా డిజైన్ చేసుకున్నాడు దర్శకుడు.. ఏం జరుగుతుందా అనే ఆసక్తికి ఒక మంచి ముగింపు ఇచ్చాడు. ఆది సాయికుమార్ ఇది చాలా రోజుల తర్వాత ఒక మంచి కం బ్యాక్ సినిమా.. అర్చన అయ్యర్, మధునందన్ క్యారెక్టర్స్ బాగున్నాయి. శ్వాసిక విజయ్, మధు నందన్, ఆనంద్, సిజ్జు తదితరులు బాగా నటించారు. శ్రీ చరణ్ పాకాల సంగీతం ఆకట్టుకుంటుంది. ప్రవీణ్ కే బండారి సినిమాటోగ్రఫీ చాలా బాగుంది. శ్రవణ్ కటికనేని ఎడిటింగ్ ఓకే. కథకు తగ్గట్టు ఖర్చు పెట్టారు నిర్మాతలు. దర్శకుడు యుగంధర్ ముని మంచి లైన్ తీసుకున్నాడు.

## కీర్తి హాట్ లుక్స్

టాలీవుడ్ క్రేజీ హీరోయిన్ కీర్తి సురేష్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. తెలుగు, తమిళం, మలయాళం భాషలలో ఎన్నో హిట్ చిత్రాల్లో నటించి మెప్పించింది. చిన్న వయసులోనే తెరంగేట్రం చేసి.. ఇప్పుడు ఇండస్ట్రీలో తనదైన ముద్ర వేసింది. అయితే తన కెరీర్ మలుపు తిప్పిన ఓ సినిమా తర్వాత తనకు దాదాపు 6 నెలలు సినిమా అవకాశాలు రాలేదని చెప్పుకొచ్చింది. హీరోయిన్ కీర్తి సురేష్ ఫాలోయింగ్ గురించి చెప్పక్కర్లేదు. మలయాళీ సినిమాతో తెరంగేట్రం చేసినప్పటికీ.. తెలుగులోనే అత్యధిక చిత్రాల్లో నటించింది. తెలుగులో నేను శైలజ సినిమాతో అడుగుపెట్టిన ఆమె.. మహానటి సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఈ సినిమాకు ఉత్తమ నటిగా జాతీయ అవార్డ్ అందుకుంది. కానీ ఈ సినిమా తర్వాత తనకు ఆరు నెలలు ఏ అవకాశం రాలేదని తెలిపింది కీర్తి. మహానటి సినిమాలో సావిత్రి పాత్రలో అద్భుతమైన నటనతో కట్టిపడేసింది. ఆమె యాక్టింగ్, లుక్స్ చూసి అడియన్స్ ఫిదా అయ్యారు. ఈ మూవీ హిట్ తర్వాత కీర్తి పేరు ఇండస్ట్రీలో మారుమోగింది. దీంతో ఆమెకు వరుస అవకాశాలు వస్తాయని అనుకున్నారు. కానీ అలా జరగలేదు.





## 2028లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు బొందపెట్టడం ఖాయమన్న కేటీఆర్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి అహంకారంతో మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోస్గిలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందిస్తూ, 2028లో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టడం ఖాయమని అన్నారు. నీటి ద్రోహంపై సమాధానం చెప్పలేక ఇష్టారీతిన మాట్లాడుతున్నారని విమర్శించారు.నదీ జలాల హక్కులను కాపాడటం చేతకాని అసమర్థుడు అహంకారంతో మాట్లాడుతున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పాలమూరు ప్రాజెక్టు గొంతుకోసి సొంత జిల్లానే మోసం చేస్తున్నాడని ఆరోపించారు. అది చాలదన్నట్లుగా కేసీఆర్‌పై ఏది పడితే అది మాట్లాడుతున్నారని అన్నారు. సభ్యత, సంస్కారం లేని నీచమైన రేవంత్ రెడ్డి ప్రవర్తనను చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు.ప్రజలు ఛీకొడుతున్నా ఇంకా మారవా అని ఎద్దేవా చేశారు. శాసనసభతో పాటు జనసభలోనూ కాంగ్రెస్ పార్టీ జలద్రోహాన్ని ఎండగడతామని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో వందేళ్ల వరకు కాంగ్రెస్ పార్టీకి పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, సందర్భం వచ్చినప్పుడు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

## కేసీఆర్ నన్ను జైలుకు పంపించి నా కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టాడని వ్యాఖ్య

కొడంగల్ బిడ్డగా ఇదే గడ్డ మీది నుంచి ఒక మాట చెబుతున్నానని, తాను రాజకీయాల్లో ఉన్నంత వరకు కేసీఆర్ సహా కల్వకుంట్ల కుటుంబాన్ని అధికారంలోకి రానివ్వనని, ఇదే తన శపథమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నారాయణపేట జిల్లా కోస్గిలో ఏర్పాటు చేసిన సర్పంచ్‌ల సన్మాన సభలో ఆయన మాట్లాడుతూ, కేసీఆర్‌ను మళ్లీ అధికారంలోకి రానివ్వనని, ఇదే తన సవాల్ అన్నారు.ఇక బీఆర్ఎస్ గతమేనని, భవిష్యత్తు కాంగ్రెస్ మాత్రమే అన్నారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 80కి పైగా సీట్లు సాధిస్తుందని, నియోజకవర్గాల పునర్విభజన జరిగి 153 అయితే 100కు పైగా స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాసిపెట్టుకోండి. రెండోసారి కాంగ్రెస్ పాలనను తీసుకువస్తాం. ఇదే నా సవాల్" అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. పదేళ్లలో కేసీఆర్ ఏ ప్రాజెక్టును పూర్తి చేయలేదని ముఖ్యమంత్రి విమర్శించారు.కేసీఆర్ తనను జైలుకు పంపించాడని, తన కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టాడని రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ తనపై విమర్శలు చేస్తూ తోలు తీస్తానని హెచ్చరించారని, కానీ మా సర్పంచ్‌లు చింతమడకలో మిమ్మల్ని చీరి చింతాకు కడతారని హెచ్చరించారు. కేంద్రమంత్రిగా, ముఖ్యమంత్రిగా, రాష్ట్ర మంత్రిగా, తెలంగాణ సాధించిన అని చెప్పకునే వ్యక్తిగా ఇలాంటి మాటలు మాట్లాడవచ్చా అని నిలదీశారు.మేం మాట్లాడాలనుకుంటే చాలా మాట్లాడుతామని, కానీ మర్యాద ఉండదని ఊరుకుంటున్నామని అన్నారు. మేం మాట్లాడటం మొదలు పెడితే మల్లన్న సాగర్‌లో దూకి చస్తావని ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఇదేనా అని ధ్వజమెత్తారు. పాలమూరు ప్రాజెక్టును ఎండగట్టారని, ప్రాజెక్టులు ఏవీ పూర్తి చేయలేదని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లు పాలమూరు ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. పదేళ్లలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని మండిపడ్డారు.



కేసీఆర్ వలస వచ్చి పాలమూరు ఎంపీ అయ్యారని అన్నారు. పగ సాధించడం మొదలు పెడితే రాష్ట్రానికి నష్టం జరుగుతుందని వదిలి పెట్టానని అన్నారు. నేను ప్రమాణం చేసినప్పుడే ఆయన కూలబడ్డారని, ఇంతకంటే పెద్ద శిక్ష ఏముంటుందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ ఫాంహౌస్‌ను బందీఖానాగా మార్చుకున్నారని, చర్లపల్లి, చంచల్‌గూడ జైలుకు పంపినా అదే పరిస్థితి ఉంటుందని అన్నారు.తాను నల్లమల నుంచి వచ్చి జెడ్పీటీసీ, ఎమ్మెల్యే, ఎంపీ తర్వాత ముఖ్యమంత్రిని అయ్యానని రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే ఏ అంశంపై అయినా చర్చించడానికి సిద్ధమని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా కేసీఆర్ వయస్సును గౌరవిస్తామని, ఈ నెల 29 నుంచి జరగబోయే సమావేశాలకు కేసీఆర్ వచ్చి సూచనలు చేయాలని అన్నారు.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM




## సచిన్ టెండూల్కర్ కన్నా వేగంగా
# ఆ మైలురాయి దాటేసిన విరాట్ కోహ్లీ

ఇండియన్ బ్యాటింగ్ స్టార్ విరాట్ కోహ్లీ కొత్త రికార్డు క్రియేట్ చేశాడు. మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ మైలురాయిని అతను దాటేశాడు. లిస్టు ఏ వన్డే క్రికెట్‌లో అత్యంత వేగంగా 16వేల రన్స్ చేసిన క్రికెటర్‌గా కోహ్లీ రికార్డు స్థాపించాడు. విరాట్ కేవలం 330వ ఇన్నింగ్స్‌లో ఆ మైలురాయిని అందుకున్నాడు. విజయ్ హజారా ట్రోఫీ వన్డే టోర్నీలో ఆడుతున్న కోహ్లీ.. ఇవాళ ఆంధ్రాతో జరిగిన మ్యాచ్‌లో హాఫ్ సెంచరీ కొట్టాడు. ఆ క్రమంలో లిస్ట్ ఏ క్రికెట్‌లో 16వేల పరుగుల మైలురాయిని దాటాడు. గతంలో టెండూల్కర్ 391 ఇన్నింగ్స్‌లో ఆ స్కోరు చేశాడు. బెంగుళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గ్రౌండ్‌లో జరుగుతున్న మైదానంలో కోహ్లీ శరవేగంగా రన్స్ రాబట్టాడు. సుమారు 15 ఏళ్ల తర్వాత విజయ్ హజారే టోర్నీలో కోహ్లీ ఆడుతున్నాడు. విజయ్ హజారే ట్రోఫీలో కోహ్లీ పేరిట గతంలో మంచి రికార్డు ఉన్నది. అతను 13 మ్యాచుల్లో 68 సగటుతో 819 రన్స్ చేశాడు. వీటిల్లో నాలుగు సెంచరీలు, మూడు ఫిఫ్టీలు ఉన్నాయి. టెస్టు, టీ20 క్రికెట్ నుంచి కోహ్లీ రిటైరైన విషయం తెలిసిందే. అయితే జనవరి 11 నుంచి కివీస్‌తో జరగనున్న వన్డే సిరీస్‌పై కోహ్లీ కన్నేసినట్లు తెలుస్తోంది.




## మసీదులో బాంబు పేలుడు..
# ఏడుగురు మృతి

పశ్చిమ ఆఫ్రికా దేశమైన నైజీరియాలో ఉగ్రవాదులు రెచ్చిపోయారు. ఓ మసీదుపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో పలువురు ప్రాణాలు కోల్పోగా.. అనేక మంది గాయపడ్డారు. ఈశాన్య నైజీరియా నగరమైన మైదుగురిలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. నగరంలోని గాంబోరు మార్కెట్‌లోని రద్దీగా ఉండే మసీదులో బుధవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ప్రార్థన సమయంలో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఇది ఆత్మాహుతి దాడిగా జిహాదిస్ట్ వ్యతిరేక మిలీషియా నాయకుడు బాబాకురా అనుమానం వ్యక్తం చేశారు. అయితే, ఈ దాడికి ఇప్పటి వరకూ ఏ సాయుధ గ్రూపులూ బాధ్యత వహించలేదు. పేలుడు ధాటికి మసీదు పూర్తిగా శిథిలమైంది.




## రణ్‌వీర్ సింగ్ 'ధురంధర్'
# బాక్సాఫీస్ దూకుడు

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటించిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. డిసెంబర్ 5న విడుదలైన ఈ సినిమా, మొదట కొంతమంది నుంచి మిశ్రమ స్పందన ఎదుర్కొన్నప్పటికీ, ఇప్పుడు రికార్డు స్థాయి వసూళ్లతో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. రోజురోజుకూ కలెక్షన్లు పెరుగుతుండటంతో 'ధురంధర్' 2025లోనే బిగ్గెస్ట్ హిట్స్‌లో ఒకటిగా నిలుస్తోంది. ఈ మూవీ ఇప్పటివరకు కేవలం హిందీ భాషలోనే విడుదలైనప్పటికీ, హిందీ వెర్షన్ నుంచే బాక్సాఫీస్ వద్ద రూ.900 కోట్లకు పైగా వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఉత్తర భారతంతో పాటు దక్షిణాది రాష్ట్రాల్లోనూ ఈ సినిమాకు అనూహ్యమైన రెస్పాన్స్ వస్తోంది. ముఖ్యంగా సౌత్‌లోనూ హిందీ వెర్షన్‌కి మంచి వసూళ్లు రావడం విశేషంగా మారింది.


# దండోరా రివ్యూ




తెలంగాణ పల్లెటూరి నేపథ్యం, కుల వివక్ష వంటి సున్నితమైన సామాజిక అంశంతో తెరకెక్కిన 'దండోరా' చిత్రం ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్ అయింది. ప్రమోషనల్ కంటెంట్‌తో ఇప్పటికే బజ్ క్రియేట్ చేసిన ఈ సినిమాపై, విడుదలకి ముందు నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలు మరింత ఆసక్తిని పెంచాయి. మరి నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం ప్రేక్షకులను ఏ మేరకు మెప్పించింది? రివ్యూలో చూద్దాం. తెలంగాణలోని తుళ్లూరు అనే గ్రామం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఆ ఊరిలో కుల వివక్ష వేళ్లూనుకుపోయి ఉంటుంది. ఎంతలా అంటే, తక్కువ కులానికి చెందిన వారు మరణిస్తే వారి అంత్యక్రియలు కూడా ఊరికి దూరంగా, ఎవరికీ కనిపించని చోట నిర్వహించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో అగ్ర కులానికి చెందిన రైతు శివాజీ (శివాజీ) హఠాత్తుగా మరణిస్తాడు. అయితే కొన్ని కారణాల వల్ల ఆయన శవాన్ని అగ్రకుల స్మశాన వాటికలో దహనం చేయడానికి వీల్లేదని ఆ కుల పెద్దలు అడ్డుతగులుతారు. దీంతో తన తండ్రికి గౌరవప్రదమైన అంత్యక్రియలు నిర్వహించాలని కొడుకు విష్ణు (నందు), కూతురు సుజాత (మనికా చిక్కాల), ఊరి సర్పంచ్ (నవదీప్) కలిసి పోరాటం మొదలుపెడతారు. అయితే సొంత కులమే శివాజీని ఎందుకు వెలివేసింది? తక్కువ కులానికి చెందిన రవి (రవికృష్ణ) హత్యకు, ఈ కుల రాజకీయాలకు సంబంధం ఏంటి? వేశ్య శ్రీలత (బిందుమాధవి) పాత్ర శివాజీ జీవితాన్ని ఎలా మార్చింది? చివరికి శివాజీ అంత్యక్రియలు సజావుగా సాగాయా లేదా? అనేదే మిగతా కథ. కులం చుట్టూ తిరిగే కథలు తెలుగు తెరపై కొత్తేమీ కాదు. అగ్ర కులాలు, తక్కువ కులాల మధ్య ఉండే అంతరాలు, ప్రేమలు, గొడవలను ఆధారంగా చేసుకుని ఇప్పటికే ఎన్నో చిత్రాలు వచ్చాయి. అయితే దర్శకుడు మురళీకాంత్ 'దండోరా' కోసం ఎంచుకున్న పాయింట్ చాలా వైవిధ్యంగా ఉంది. సాధారణంగా సినిమాల్లో నిమ్న కులాల వారే బాధితులుగా కనిపిస్తారు. కానీ, ఈ చిత్రంలో అగ్ర కులాల వారే బాధితులుగా మారడం అనేది ఒక ఆసక్తికరంగా మారింది. ఫస్టాఫ్ కథలోని పాత్రలను ఎస్టాబ్లిష్ చేయడానికి దర్శకుడు చాలా సమయం తీసుకున్నారు. ప్రారంభంలో కథనం వేగంగా సాగకపోయినా, దర్శకుడు అసలు ఏం చెప్పాలనుకుంటున్నారు అనే విషయంలో ప్రేక్షకులకు కాస్త సందిగ్ధత నెలకొంటుంది. సీన్లు అక్కడక్కడే తిరుగుతున్నట్టు, కథ రెగ్యులర్ ఫార్మాట్‌లో సాగుతున్నట్టు అనిపిస్తుంది. కానీ, ఇంటర్వెల్ బ్లాక్ దగ్గరకు వచ్చేసరికి సినిమా ఒక్కసారిగా మలుపు తిరుగుతుంది. అప్పటివరకు ఉన్న సందేహాలకు సూటిగా సమాధానం చెబుతూ, కథను అసలైన ట్రాక్‌లోకి ఎక్కించారు. సెకండాఫ్ రెండో భాగంలో కూడా అక్కడక్కడా నెమ్మదించిన భావన కలుగుతుంది. ముఖ్యంగా శివాజీ మరియు బిందుమాధవి మధ్య వచ్చే కొన్ని సన్నివేశాలు కథను సాగదీసినట్టు అనిపిస్తాయి. అయితే, ఎప్పుడైతే కోర్టు ఎపిసోడ్ మొదలవుతుందో, అప్పటి నుండి సినిమా గ్రాఫ్ ఒక్కసారిగా పెరిగిపోతుంది. శివాజీ పాత్ర తన నటనతో చెలరేగిపోగా, మిగిలిన పాత్రలు కూడా అంతే ఇంటెన్స్‌గా సాగుతాయి. చివరి అరగంటలో దర్శకుడు పండించిన ఎమోషన్స్ సినిమాకు ప్రాణవాయువుగా నిలిచాయి. హృదయాన్ని కదిలించే సన్నివేశాలు, సమాజాన్ని ఆలోచింపజేసే సంభాషణలతో సినిమాను క్లైమాక్స్ వైపు నడిపించిన తీరు ప్రశంసనీయం. ఎమోషనల్ కంటెంట్ సరిగ్గా కుదరడం వల్ల, సినిమాను సక్సెస్ బాట పట్టించడంలో దర్శకుడు సక్సెస్ అయ్యాడని చెప్పవచ్చు. ఈ సినిమా భారాన్ని తన భుజాలపై మోస్తూ, మరోసారి పవర్‌ఫుల్ పర్ఫార్మెన్స్‌తో చెలరేగిపోయాడు శివాజీ. తన సీనియారిటీతో సినిమాకు వెన్నెముకగా నిలిచాడు. నవదీప్ 2.0 వెర్షన్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణ. ఇప్పటివరకు ఆయనకున్న ఇమేజ్‌కు పూర్తి భిన్నమైన పాత్రలో ఒదిగిపోయి ఆశ్చర్యపరిచాడు. నందు విషయానికి వస్తే ఈ చిత్రంలో మనం ఒక కొత్త నందుని చూస్తాం. నటుడిగా ఆయనలో ఉన్న మెచ్యూరిటీని అద్భుతంగా ప్రదర్శించారు. ముఖ్యంగా ప్రీ-క్లైమాక్స్ నుండి సినిమా ముగిసే వరకు తన నటనతో ప్రేక్షకులను తన వైపు తిప్పుకున్నాడు. బిందుమాధవి, మణిక, మౌనిక రెడ్డి తమ పాత్రలకు పూర్తి న్యాయం చేశారు. ప్రతి పాత్ర కథలో గుర్తుండిపోయేలా ఉంది. వెంకట్ కెమెరా పనితనం సినిమాకు అదనపు బలాన్నిచ్చింది. తెలంగాణ గ్రామీణ వాతావరణాన్ని సహజంగా బంధించడమే కాకుండా, సన్నివేశాల్లోని ఫీల్‌ను చక్కగా ఎలివేట్ చేశారు. మార్క్ కె రాబిన్ అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ బాగుంది. అది కథలోని ఎమోషన్స్‌ను పీక్స్‌కు తీసుకెళ్లింది. సృజన ఎడిటింగ్ బాగున్నా, అక్కడక్కడా ఇంకాస్త షార్ప్‌గా ఉండాల్సిందనిపిస్తుంది. క్రాంతి ప్రియం ఆర్ట్ వర్క్, రేఖా బొగ్గారపు కాస్ట్యూమ్స్ సినిమా మూడ్‌కు తగ్గట్టుగా ఉన్నాయి. లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రవీంద్ర బెనర్జీ ముప్పనేని ఎక్కడా రాజీ పడకుండా ఈ చిత్రాన్ని నిర్మించారు. సినిమా పట్ల ఆయనకున్న ప్యాషన్ ప్రతి ఫ్రేమ్‌లోనూ కనిపిస్తుంది. సామాజిక అసమానతలు, కులం పేరుతో జరిగే అరాచకాలను ఎండగట్టాలనే తపనతో 'దండోరా' రూపొందింది. ప్రస్తుత తరం ఆలోచనలకు భిన్నంగా, సమాజానికి కనువిప్పు కలిగించేలా దర్శకుడు మురళీకాంత్ ఈ చిత్రాన్ని తీర్చిదిద్దారు. ముఖ్యంగా సినిమా ఓపెనింగ్‌ను, క్లోజింగ్‌ను నవదీప్ పాత్రతో కనెక్ట్ చేసిన విధానం చాలా బాగుంది. చక్కటి కథ, బలమైన సామాజిక సందేశం మరియు నటీనటుల పవర్‌ఫుల్ పర్ఫార్మెన్స్ చూడాలనుకుంటే.. ఈ వారం థియేటర్లలో 'దండోరా'ను నిస్సందేహంగా చూడవచ్చు.

# రోషన్ 'ఛాంపియన్' రివ్యూ

శ్రీకాంత్ తనయుడు రోషన్ రీలాంచ్ సినిమా కావడం, వైజయంతీ, స్వప్న సినిమాస్ లాంటి భారీ బ్యానర్ లో రావడంతో ఆసక్తి ఏర్పడింది. అంతేకాదు.. నేషనల్ అవార్డ్ విజేత ప్రదీప్ అద్వైతం దర్శకుడు కావడం, పాటలు జనాల్లోకి వెళ్ళడం, అన్నిటికీ మించి తెలంగాణ బైరాన్ పల్లి చరిత్ర నేపథ్యంలో వస్తున్న కథ కావడంతో సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి. మరి ఆ అంచనాలని ఛాంపియన్ అందుకుందా? రోషన్ ఖాతాలో హిట్ పడిందా? రివ్యూలో చూద్దాం. 1947 ఆగష్టు 15న భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. కానీ అప్పటికి హైదరాబాద్ ఇంకా నిజాం పాలనలోనే వుంది. నిజాం ప్రభువు హైదరాబాద్ స్వాతంత్ర దేశం కోసం ప్రయత్నాలు చేస్తున్న కాలమది. అయితే రజాకార్ సైన్యానికి అధ్యక్షుడిగా ఖాసిం రజ్వీ ప్రజలని హింసిస్తుంటాడు. రజాకార్ల దౌర్జన్యాలను ఎదుర్కో నేందుకు బైరాన్ పల్లి ప్రజలు ఒక దళంలా ఏర్పడి సాయుధ పోరాటం చేస్తుంటారు. ఇదే సమయంలో సికింద్రాబాద్ బ్లూస్ టీంలో కీలక ఫుట్‌బాల్ ఆటగాడు మైఖేల్ సి విలియమ్స్ (రోషన్). ఇంగ్లాండ్ వెళ్లి అక్కడ ఆడాలనేది తన కల. కాకపోతే అనుకోని పరిస్థితులు కారణంగా బైరాన్‌పల్లి గ్రామం చేస్తున్న పోరాటంలోకి అడుగుపెడతాడు మైఖేల్. ఆ తర్వాత ఏం జరిగింది? బైరాన్ పల్లి పోరాటంలో తనూ చేతులు కలిపాడా? ఇంగ్లాండ్ వెళ్లాలనుకున్న తన కల నెరవేరిందా? రజాకార్ సైన్యానికి, బైరాన్ పల్లికి మధ్య ఎలాంటి పోరాటం జరిగిందనేది మిగతా కథ. బైరాన్‌పల్లిసాయుధ పోరాటాన్ని, మైఖేల్ సి విలియమ్స్ అనే ఫుట్‌బాల్ ఆటగాడి కథను ముడిపెట్టి రాసుకున్న ఫిక్షనల్ స్టోరీ ఇది. బైరాన్‌పల్లి సాయుధ పోరాటం నేపథ్యాన్ని పరిచయం చేస్తూ కథమొదలౌతుంది. పీరియాడిక్ సన్నివేశాని దర్శకుడు చక్కగా తీర్చిదిద్దాడు. కథలో కావాల్సినంత డ్రామా, భావోద్వేగ




చూపించగలిగాడు. మైకేల్ (రోషన్) ఫుట్‌బాల్ ఛాంపియన్ ట్రాక్ కూడా ఆసక్తికరంగా వుట్నుంది. తను బైరాన్ పల్లిలోకి అడుగు పెట్టే తర్వాత వచ్చే సన్నివేశాలు కొన్ని నెమ్మదిగా అనిపించినప్పటికీ ఇంటర్వెల్ సీక్వెన్స్ తో కథలో తీవ్రత మరింతగా పెరుగుతుంది. సెకండ్ హాఫ్‌లో తెలంగాణ సాయుధ పోరాటం, వారి లక్ష్యాన్ని చూపించిన తీరు నిజాయితీగా వుంటుంది. నైజాం పాలనలో జరిగిన అణచివేతను దర్శకుడు ప్రభావవంతంగా చూపించగలిగాడు. ప్రీఇంటర్వెల్ లో రోషన్ ఫుట్ బాల్ ఆడే సన్నివేశం చాలా ఎఫెక్టివ్ గా వచ్చింది. ఇక క్లైమాక్స్ లో బైరాన్ పల్లి పోరాటం చూపించిన తీరు ప్రేక్షకులని కట్టిపడేస్తుంది. బైరాన్ పల్లి పోరాటాన్ని ఈస్థాయిలో చూపిస్తారని ఎవరూ ఊహించి వుండరు. అంత హెవీగా వార్ సీన్స్ ని తీర్చిదిద్దారు. రోషన్ తన బెస్ట్ ఇచ్చాడు. ఇలాంటి హిస్టారికల్ సినిమాల్లో ఒక ప్రధాన పాత్రని మోయడం అంత ఈజీకాదు. అయితే రోషన్ ఆ పనిని సమర్ధవంతంగా చేయగలిగాడు. మైఖేల్ పాత్రలో తన నటన గుర్తుండిపోతుంది. అనస్వర రాజన్ పాత్ర బావుంది. ప్రేమకథని చాలా చక్కగా డీల్ చేశారు. రాజి రెడ్డి పాత్రలో నందమూరి కళ్యాణ్ చక్రవర్తి, ఆయన భార్య పాత్రలో అర్చన హుందాగా కనిపించారు. దుల్కర్ సల్మాన్ అతిథి పాత్రలో మెరిశారు. ప్రకాష్ రాజ్, మురళిధర్, మురళిశర్మ, రచ్చరవి ఈ పాత్రలనీ కథకు తగ్గట్టుగా కుదిరాయి. సినిమా టెక్నికల్ స్టాండర్డ్స్, ప్రొడక్షన్ విలువలు చాలా ఉన్నతంగా ఉన్నాయి. మిక్కీజే మేయర్ స్వరపరిచిన గిరగిర, సల్లంగుండాలే పాటలు ఆకట్టుకున్నాయి. నేపథ్య సంగీతం కూడా బావుంది. సినిమాలో విజువల్ గ్రాండియర్ వుంది. స్వప్న సినిమాస్ నిర్మాణ విలువలు సినిమాని ప్రత్యేకంగా నిలబెట్టాయి.



## 'వారణాసి'లో కీలక పాత్రలో
# ప్రకాష్ రాజ్

సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు ఎస్. ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'వారణాసి'పై ప్రేక్షకుల్లో అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్‌గా కనిపించనున్నాడు. దాదాపు రూ.1300 కోట్ల భారీ బడ్జెట్‌తో, హాలీవుడ్ స్థాయిలో ఈ సినిమాను రాజమౌళి తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల విడుదలైన 'వారణాసి' కాన్సెప్ట్ వీడియోకు దేశవ్యాప్తంగా మాత్రమే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ విశేష స్పందన లభించింది. ఈ వీడియో ఇంటర్నేషనల్ ట్రెండింగ్‌లో నిలవడమే కాకుండా, హాలీవుడ్ మీడియా కూడా దీనిపై ప్రత్యేక కథనాలు ప్రచురించడంతో సినిమాపై హైప్ మరింత పెరిగింది. ఈ క్రమంలో తాజాగా ఈ సినిమా గురించి నటుడు ప్రకాష్ రాజ్ చేసిన పోస్ట్ ఆసక్తికరంగా మారింది. 'వారణాసి' చిత్రంలో తాను కీలక పాత్రలో నటిస్తున్నట్లు ఆయనే స్వయంగా వెల్లడించారు. సోషల్ మీడియాలో చేసిన పోస్ట్‌లో, "వారణాసి సినిమా కోసం ఒక అద్భుతమైన షెడ్యూల్‌ను పూర్తి చేశాము. ఈ పాత్ర నాలోని నటుడి దాహార్తిని తీరుస్తోంది. మహేష్ బాబు, పృథ్వీరాజ్, ప్రియాంక చోప్రా మీతో కలిసి పనిచేయడం ఎంతో ఆనందంగా ఉంది. తదుపరి షెడ్యూల్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని ప్రకాష్ రాజ్ పేర్కొన్నారు. ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.